రాష్ట్ర సలహా మండలి ప్రతినిధిగా భాగ్యలక్ష్మి

భాగ్యలక్ష్మిని సన్మానిస్తున్న వెలుగు సిబ్బంది

మదనపల్లె అర్బన్ : మండలంలోని అమ్మచెరువు మిట్ట వెలుగు సంస్థలో కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న అర్.భాగ్యలక్ష్మిని విభిన్న ప్రతిభావంతుల హక్కుల పరిరక్షణ. కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి సలహా మండలి ప్రతినిధిగా ఎన్నుకున్నారు. శుక్రవారం ఆమెను వెలుగు ప్రత్యేక పాఠశాల సిబ్బంది, చిన్నారులు, వృద్ధులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వెలుగు సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం రాష్ట్ర స్థాయి సలహా మండలిని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ అవకాశం కల్పించిన ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్‌కి భాగ్యలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వెలుగు ప్రిన్సిపల్ లీనా కుమారి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

రవ్వలగుట్ట భూమిని పేదలకు ఇవ్వాలి : సిపిఎం

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

రాయచోటి మున్సిపాలిటీలోని రవ్వలగుట్ట చుట్టూ ఉన్న ప్రభుత్వ భూమిని పేదలకు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.రామాంజులు డిమాండ్ చేశారు. రవ్వలగుట్టలో అక్రమ నిర్మాణాలను సిపిఎం బృందం శుక్రవారం పరిశీలించింది. అనంతరం కలెక్టర్ గిరీషకు అక్రమార్కులపై చర్యలు తీసుకుని, ఆ భూమిని పేదలకు పంచాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రామాంజులు మాట్లాడుతూ రవ్వలగుట్టలో స్థానికేతులు, భూస్వాములు, ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి 3, 4, 5 సెంట్ల స్థలంలో పెద్దపెద్ద భవంతులు కడుతున్నారని తెలిపారు. ఫేక్ డీఫారాలు కలిగి అనర్హుల పేరుతో నిర్మించే అక్రమ కట్టడాలు వెంటనే నిలిపేసి ఇళ్లు లేని నిరుపేదలకు లేదా ప్రభుత్వ రంగ సంస్థలకు వాడుకోవాలని సూచించారు. ఆ స్థల అనుభవంలో ఉన్న గిరిజనులే ఇళ్ల నిర్మాణానికి అర్హులని ఉమ్మడి కడప జిల్లా జడ్జి వచ్చి చెప్పినప్పటికీ ఉపయోగం లేదన్నారు. తహశీల్దార్ ప్రభుత్వ స్థలం నా సొంత ఆస్థి కాదు కదా ఎవరూ ఆక్రమించుకుంటే నాకేమిటీ అనుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలాన్ని కాపాడుకోవడంలో విఫలమయ్యారని విమర్శించారు. 1002 సర్వేలోని 129 ప్లాట్‌కు సంబంధించిన డీ పామ్ ఉన్నా వీఆర్వో అభ్యంతరం చెబుతున్నారని తెలిపారు. ఒక విఆర్ఒ అక్రమంగా మూడంతస్తుల భవనం కడుతున్నారని విచారణ జరిపి స్వాధీనం చేసుకోవాలన్నారు. రవ్వలగుట్టలో అక్రమ కట్టడాలు నిలిపే వరకు పేద ప్రజానీకానికి ఇచ్చే వరకు సిపిఎం పోరాడుతున్నదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఫయాజ్, ఆంజనేయులు, గణపతి పాల్గొన్నారు.

'గడువులోగా అర్జీలను పరిష్కరించాలి'

ప్రజాశక్తి-రాయచోటి

జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో వచ్చిన రెవెన్యూ శాఖ అర్జీలను గడువులోగా నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ గిరీష తహశీల్దార్లు, ఆర్‌డిఒలను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జగనన్నకు చెబుతాం కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ శాఖకు సంబంధించిన అర్జీల పరిష్కారంపై తహశీల్దార్లు, ఆర్‌డిఒలు, విఆర్‌ఒలు, సర్వేయర్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి ఎక్కువగా భూమి సమస్యల పైన అర్జీలు వస్తున్నాయపి తెలిపారు. అర్జీలను నిజంగా పరిశీలించి అందులోని అంశాలపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి వాటిని ఎస్‌ఎల్‌ఎ గడువులోగా పరిష్కరించాలని సూచించారు. డికెటి, పట్టా భూములకు సంబంధించిన సర్వే నెంబర్లు, సరిహద్దు కొలతలు, సబ్ డివిజన్, మ్యుటేషన్స్ తదితర సమస్యలపై అర్జీలు వచ్చినప్పుడు వాటిపై క్షేత్రస్థాయిలో వాస్తవ అంశాలను పరిగణలోకి తీసుకోవాలి. సర్వే నిమిత్తం క్షేత్రస్థాయికి వెళ్ళినప్పుడు తప్పనిసరిగా సర్వే రిపోర్టు, ఎఫ్‌ఎంబిలను పక్కాగా రూపొందించాలని విఆర్‌ఒలను ఆదేశించారు. సమస్యలపై సమగ్రమైన నాణ్యత కలిగిన సమాచారంతో అర్జీలను పరిష్కరించాలన్నారు. ఒక టీం ఏర్పాటు చేసి తాసిల్దార్లు జగనన్నకు చెబుదాం సమస్యలను నాణ్యతగా పరిష్కరిస్తున్నారా లేదా అని పర్యవేక్షణ చేయాలని ఆర్‌డిఒలకు సూచించారు. నోటీసు జారీ చేయడం, సర్వే చేయడం, విఆర్ఒ రిపోర్ట్ తదితరాలలో పక్కాగా సమాచారం రూపొందించి నిర్ణీత గడువులోగా అర్జీదారునికి పంపించి సమస్యలను నాణ్యతగా పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. చుక్కల భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలని ఇనాం భూములు, సాదా బైనమా భూముల విషయంలో ముటేషన్స్‌కు సంబంధించి మార్గదర్శకాల మేరకు పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమీక్ష సమావేశంలో రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్‌డిఒలు రంగస్వామి, మురళి, తహశీల్దార్లు, విఆర్‌ఒలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

చుక్కల భూములకు శాశ్వత పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

చుక్కల భూములకు సంపూర్ణ హక్కును ప్రభుత్వం కల్పించిందని కలెక్టర్ గిరీష తెలిపారు. శుక్రవారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు కావలి వేదిక నుంచి దశాబ్దాల సమస్యకు చరమగీతం పాడుతూ చుక్కల భూముల చిక్కులకు జగనన్న ప్రభుత్వం శాశ్వత పరిష్కారంలో భాగంగా రైతుల కుటుంబాలకు మేలు చేస్తూ చుక్కల భూములకు సంపూర్ణ హక్కును అందించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నుంచి కలెక్టర్ గిరీష, డిఆర్‌ఒ సత్యనారాయణ, రాయచోటి ఆర్‌డిఒ రంగస్వామి, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయంతో అన్నమయ్య జిల్లాలో చుక్కల భూములకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 30,525 రైతన్నల కుటుంబాలకు మేలు చేస్తూ 28,882.29 ఎకరాల చుక్కల భూములకు సంపూర్ణ హక్కుతో రూ.579.832 కోట్ల మార్కెట్ విలువ కలిగిన భూములకు పూర్తి హక్కులు ప్రభుత్వం కల్పించిందన్నారు. దశాబ్దాల సమస్యకు చరమగీతం పాడుతూ చుక్కల భూముల చిక్కులకు రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపించి రైతన్నలకు సర్వ హక్కులూ కల్పించిందన్నారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల ఈ భూములను సర్వ హక్కులతో క్రయవిక్రయాలకు, రుణాలు పొందడానికి, తనఖా పెట్టుకోవడానికి, బహుమతిగా ఇవ్వడానికి, వారసత్వపు ఆస్తిగా అందించడానికి వెసులుబాటు కల్పించిందని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో సర్వే హక్కులు కూడా లభించేలా నిషేధిత భూముల జాబితా నుండి తొలగింపు జరిగిందన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులకు హక్కు పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ గిరీష

మలేరియా రహిత జిల్లానే లక్ష్యం : డిఆర్‌ఒ

ప్రజాశక్తి-రాయచోటి

దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసుకుంటే అనారోగ్యం బారిన పడే అవకాశాలు తగ్గుతాయని డిఆర్‌ఒ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో తన ఛాంబర్‌లో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా జిల్లాలో మలేరియా, డెంగీ నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.కొండయ్య, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ కె.వేణుగోపాల్ పాల్గొని జిల్లాలో మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలకుండా వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు వివరించారు. మున్సిపల్, పంచాయతీ, విద్య, మత్స్య, మైన్స్, ఫారెస్ట్ అధికారులు వైద్యారోగ్య శాఖతో ఏ విధంగా సమన్వయం చేసుకోవాలన్న అంశాలపై చర్చించారు. జిల్లాలో మలేరియా, డెంగీ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ముఖ్యంగా మున్సిపల్ పరిధిలో సమస్యాత్మక వార్డుల్లో ఫాగింగ్, డ్రైనేజీ మురుగునీరు చేరకుండా అపరిశుభ్రత వాతావరణం లేకుండా సానిటరీ సెక్రెటరీలను అప్రమత్తం చేయాలని పేర్కొన్నారు. గ్రామాల్లో కూడా అన్ని కంటైనర్లు ఫ్రిడ్జ్ వాటర్ కూలర్లు ఇండోర్ ప్లాంట్స్ వాడుతున్న ప్రజలకు అవగాహన కల్పించి, బాధ్యతాయుతంగా ఆయా శాఖలు తమ విధులు నిర్వర్తిస్తూ వ్యాధులు ప్రభావకుండా నిరోధక చర్యలు చేపట్టాలని అధికారులతో పేర్కొన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న డిఆర్‌ఒ సత్యనారాయణ

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

రైతుల కష్టాలు ప్రభుత్వానికి పట్టవా?

- మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగ మారిందని, టమోటా రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించకుంటే ఆందోళనలు చేస్తామని మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హెచ్చరించారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.లక్షలు వెచ్చించి టమోటా పంటను సాగు చేసిన రైతులకు గిట్టుబాటు ధరలు లేక తీవ్రమైన ఆందోళనలో వున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి కిలో టమోటా రూ.15లకు కొనుగోలు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణం స్పందించి టమోటా రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి ఆదుకోవాలని కోరారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకొని సొమ్ము చేసుకోవడానికి మార్కెట్‌కు తీసుకువస్తే నామమాత్రపు ధరలు కూడా పలకకపోవడంతో క్రేట్లతో సహా కాయలను అక్కడే వదిలేసి వెళ్లిపోవాల్సిన దుస్థితిని రైతులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టమోటా పంట చేతికి రావాలంటే 90 రోజులు కష్టపడి సాగు చేస్తే తప్ప ప్రతిఫలం ఉండదని, టమోటా ధరలు పతనంపై అధికార పార్టీ శాసనసభ్యులు, మంత్రులు, ముఖ్యమంత్రి ఎవరు స్పందించకపోవడం పట్ల ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. దీనిపై ఆదివారం లోపు ప్రభుత్వం టమోటాకు మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో సోమవారం మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట టమోటాలతో పెద్ద ఎత్తున రైతులతో కలసి ధర్నాకు కూర్చుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రాటకొండ మధుబాబు, ఎస్.ఎ.మస్తాన్, మోడెం సిద్దప్ప, విద్యా సాగర్, నీలకంఠ, నవీన్ చౌదరి, నాదెళ్ల విద్యా సాగర్, నాగూర్ వలి, షంషీర్, ఇంతియాజ్, గిరీష్, శ్రీరాములు, మహబూబ్ బాషా, హరి, వేమయ్య, నజీర్ నాదెళ్ల శివ, బండి అమర పాల్గొన్నారు.

'నాడు-నేడు పనులను త్వరగా పూర్తి చేయాలి'

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో నిర్మిస్తున్న జగనన్న హౌసింగ్ లేఔట్లలో స్టేజి కన్వర్షన్ మీద దృష్టి సారించాలని, మనబడి నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ గిరీష హెచ్చరించారు. శుక్రవారం కలెక్టర్ గిరీష జిల్లాలో జరుగుతున్న జగనన్న హౌసింగ్ లేఔట్లలో ఇళ్ల నిర్మాణ పనులు, మనబడి నాడు నేడు పనుల మీద హౌసింగ్ అధికారులు, ఎంపీడీవోలు మున్సిపల్ కమిషనర్లు, విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న హౌసింగ్ లేఔట్లలో స్టేజి కన్వర్షన్ మీద దృష్టి సారించాలని, మనబడి నాడు నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రతి లేఔట్‌లో మౌలిక సదుపాయాలు అన్ని లైన్ డిపార్టుమెంటు సమన్వయంతో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి మండలంలోని బిబిఎల్ హౌసెస్ అన్ని బిఎల్ స్టేజికి వచ్చే విధంగా కృషి చేయాలని తెలియచేసారు. నాడు నేడు పనులలో ఉన్న టాయిలెట్ల నిర్మాణం, కాంపౌండ్ వాల్ నిర్మాణం తదితర 10 అంశాల మీద దృష్టి సాధించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అందుబాటులో ఉన్న నిధులను సద్వినియోగం చేసుకొని పనులను వేగవంతం చేయాలని ఆయన సూచించారు. సమీక్షలో మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల బాలురులో 2023-2024 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలకు గిరిజన విద్యార్థుల నుండి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపల్ కె.రంగనాయకులు తెలిపారు. పాఠశాలలో మూడవ తరగతికి కేటా యించిన 40 సీట్లలో ఎస్టీలకు 31 సీట్లు, ఎస్సీలకు 5 సీట్లు బీసీలకు 2 సీట్లు, ఓసీలకు 1 సీటు, ఎఇక్యూలో ఒక సీటు చొప్పున కేటాయించామని పేర్కొన్నారు. నాల్గవతరగతిలో 35 సీట్లు, ఐదవ తరగతిలో 26 సీట్లు, ఆరవ తరగతిలో 12 సీట్లు, ఏడవ తరగతిలో 4 సీట్లు, 8వ తరగతిలో మూడు సీట్లు, 9వ తరగతిలో ఒక సీటు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. నాల్గవ తరగతి నుండి తొమ్మిదవ తరగతి వరకు గల ఖాళీ సీట్లలో కేవలం ఎస్టీ విద్యార్థులతో మాత్రమే నింపుతామని తెలిపారు. దరఖాస్తులకు ఈ నెల 30వ తేదీ ఆఖరుగా నిర్ణయించామన్నారు.

రాజీమార్గమే రాజమార్గం : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాజీమార్గమే రాజమార్గమని జాతీయ మెగా లోక్ అదాలత్ ద్వారా కేసులు సులభంగా పరిష్కరించుకోవచ్చునని మదనపల్లి డిఎస్‌పి కె.కేశప్ప పేర్కొన్నారు. పట్టణంలోని న్యాయస్థానంలో 13వ తేదీ జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్ ద్వారా ఎలాంటి ఫీజులు లేకుండా రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవచ్చునని అందువల్ల సమాజంలో ప్రశాంతమైన జీవనం సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు. పట్టణంలో ఇప్పటి వరకు చాలా మంది లోక్ అదాలత్ ద్వారాకేసులు రాజీమార్గాన్ని ఎంచుకున్నారని తెలియజేశారు. మదనపల్లి టూ టౌన్ సిఐ మురళీకృష్ణ మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా ఎంతోమంది కేసులు రాజీ చేసుకుని సత్వర న్యాయం పొందారని పంతాలు పట్టింపులకు పోకుండా రాజీమార్గం ద్వారా ప్రశాంతమైన జీవితం కొనసాగించవచ్చునని పేర్కొన్నారు. జాతీయ మెగాలోక్ అదాలత్ సందర్భంగా మదనపల్లి టూ టౌన్ పోలీస్ స్టేషన్ నుండి సిటిఎం రోడ్డు మీదుగా టౌన్ క్లబ్ చిత్తూరు బస్టాండు బెంగళూరు బస్టాండు మెట్రో కాంప్లెక్స్ మీదుగా అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మదనపల్లి టూ టౌన్ ఎస్ఐ లోకేష్‌రెడ్డి, వన్‌టౌన్ ఎస్ఐ హరిహర ప్రసాద్, ట్రాఫిక్ ఎస్ఐ రామాంజనేయుడు, పోలీసు సిబ్బంది, మహిళా సంరక్షణ పోలీసులు జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థినిలు పాల్గొన్నారు.

పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు


ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న రమేష్‌రెడ్డి

జగన్ పోవాలి..జనం బాగుండాలి : ఆర్‌ఆర్

రాయచోటి: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పోవాలి జనం బాగుండాలని ఒక్క ఛాన్స్ అంటూ చెప్పిన మాటల మాయలోపడి మోసపోయామని ప్రజల వాపోతున్నారని మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి అన్నారు. తెలుగుదేశం పార్టీ శ్రేణులతో కలిసి శుక్రవారం 25, 26వ వార్డులో ఇదేమి కర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్తున్నామని ప్రజల నుండి లభిస్తున్న స్పందన చాలా సంతోషంగా ఉందని సైకో పాలనలో ఏ ఒక్కరు కూడా సంతోషంగా లేరని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బోనముల ఖాదరవల్లి, మాజీ కౌన్సిలర్ మహబూబ్ భాష, కొట్టే చలపతి, రాయచోటి తెలుగు యువత అధ్యక్షులు ఇనముల్లా ఇలియాజ్, జగదీష్, అమావాస్య రెడ్డెయ్య, సర్దార్, శేషి జాబీర్ అఫ్జల్, శ్రీనివాసులు, శివారెడ్డి, మన్సూర్, రామకృష్ణగౌడ్, వెంకట్రామిరెడ్డి, సుబాన్‌బాష, గంగాధర్, దుర్గ, రెడ్డి భాష, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

'మిట్స్'లో సినీ హీరో సత్యదేవ్ సందడి

కురబలకోట: మిట్స్ కళాశాలలో శుక్రవారం జాతీయ స్థాయిలో టెక్నో-కల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్-ఆశ్వ 2కె23 కార్యక్రమాన్ని ద్వారాకనాథ్, సినీ హీరో సత్యదేవ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సత్యదేవ్ విద్యార్థులతో కలిసి డాన్స్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఒక లక్ష్యం ఉండాలన్నారు. యువత అనుకుంటే సాధించలేనిది ఏది లేదన్నారు. ప్రస్తుత కంప్యూటర్ యుగంలో అనేక మార్పులతో యువత ముందుకు వెళుతున్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ యువరాజ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతో డ్యాన్స్ చేస్తున్న హీరో సత్యదేవ్

మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ

త్వరలో మండలాలకు వేరుశనగ విత్తనాలు

- జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-పీలేరు

జిల్లాలోని అన్ని మండలాల్లోనూ త్వరలో రైతులకు అందుబాటులో వేరుశనగ విత్తనాలు రానున్నాయని జిల్లా వ్యవసాయ అధికారి యు.ఉమామహేశ్వరమ్మ తెలిపారు. శుక్రవారం ఆమె పీలేరు మండల వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేరుశనగ కాయల విత్తనాలను వీలైనంత త్వరగా మండలాలకు తెప్పిస్తామని పేర్కొన్నారు. ఖరీఫ్ సాగుకు ఎలాంటి వేరుశనగ కొరత రాకుండా, లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. క్లస్టర్ యంత్రసేవా పథకంలో వరికోత యంత్రం, కిసాన్ డ్రోన్లు సబ్సిడీకి అందుబాటులో ఉన్నాయని, వీటి కొనుగోలుకు రైతులు ముందుకు రావాలని కోరారు. పీలేరు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు వైవి రమణ రావు మాట్లాడుతూ చిరుధాన్యాలను కూడా సబ్సిడీకి తెప్పిస్తామని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలియచేశారు. పశు సంవర్ధకశాఖ అధికారి కె.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ అనిమల్ అంబులెన్స్, టోల్‌ఫ్రీ1962 సేవలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం, కెవి పల్లి మండల వ్యవసాయ అధికారులు షణ్ముగం, శ్రావణి, పీలేరు మండల వ్యవసాయ అధికారిణి రమాదేవి, టిఎ కరుణాకర్ రెడ్డి, ఉద్యానవన అధికారి సుకుమార్ రెడ్డి, డిఆర్‌డిఎ ఎపిఎం లక్ష్మణరెడ్డి, రైతు భరోసా కేంద్ర సిబ్బంది, ఎఇఒలు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి : ఎస్ఐ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని వాల్మీకిపురం ఎస్ఐ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం పట్టణంలో గాంధీ బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాల్లో రోడ్డు భద్రత అద్దాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలన్నారు. అతి వేగంగా వెళ్లడం, హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయడం, రోడ్డుకు కుడి వైపు వెళ్లడం, రెడ్ సిగ్నల్ పడ్డా వెళ్లడం, వాహనాలను ఓవర్‌ట్యాక్ చేయడం, వెనుక వైపు వచ్చే వాహనాలకు దారి ఇవ్వకుండా అడ్డుపడడం వంటివి చేయకూడదన్నారు. ప్రతి ఒక్కరూ లైసెన్సు కలిగి ఉండాలని, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు పెట్టుకోవాలని, ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ ధరించాలని సూచించారు. ఆటో డ్రైవర్లు యూనిఫారం ధరించాలని, పరిమితికి మించి ప్రయాణికులను తరలించకూడదన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా అద్దాలను ఏర్పాటు చేస్తున్న ఎస్ఐ నాగేశ్వరరావు

సంతకం సరే.. సెక్రటరీ ఎక్కడ..?

- రిజిస్టర్‌లో సంతకం చేసి బయటికెళ్లిన వైనం

- కలెక్టర్‌కు ఎంపిడిఒ ఫిర్యాదు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఓ పంచాయతీ సెక్రటరీ సచివాలయానికి వచ్చి రిజిస్టర్‌లో ఉదయం, మధ్యాహ్నంకు సంబంధించి సంతకాలు చేసి.. ఎక్కడికి వెళ్లారో తెలియ కపోవడంతో పలు సమస్యలపై వచ్చిన ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. వాల్మీకిపురం సచివాలయం-4 (ఓబులంపల్లి సచివాలయం)కు సంబం ధించిన పంచాయతీ కార్యదర్శి శుక్రవారం ఉదయం సచివాలయానికి వచ్చి ఉదయం, మధ్యాహ్నంకు సంబంధించి రిజిస్టర్‌లో సంతకాలు చేసి వెళ్లిపోయారు. పలు సమస్యలపై వచ్చిన ప్రజలు పంచాయతీ కార్యదర్శి లేకపోవడంతో సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సచివాలయం-4లో ఉద్యోగులు కూడా నిర్లక్ష్యంగా సమాధానాలు చెబుతారనే ఆరోపణలు కూడా అనేకం. పంచాయతీ కార్యదర్శి లేకపోవడంపై ఎంపిడిఒకు ప్రజలు తెలియజేయడంతో స్పందించిన ఎంపిడిఒ సచివాలయాన్ని తనిఖీ చేసి, ఉదయం, మధ్యాహ్నంకు సంబంధించి సంతకాలు చేసి పంచాయతీ కార్యదర్శి వెళ్లిపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి ఇష్టానుసారంగా సచివాలయ సిబ్బందిని నిర్లక్ష్యంగా మాట్లాడుతుందని, వివిధ సమస్యలను చెప్పుకునేందుకు సచివాలయానికి వచ్చే ప్రజలను కూడా విసిగించుకొని మాట్లాడుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఎంపిడిఒ షబ్బీర్ అహ్మద్‌ను వివరణ కోరగా.. పంచాయతీ కార్యదర్శి విధులకు వచ్చి రిజిస్టర్‌లో సంతకాలు చేసి, వెళ్లిపోవడం వాస్తవమేనని, ఈ విషయాన్ని కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశామన్నారు.

కార్యదర్శి విధుల్లో లేకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీ

ప్రజలతో కలసి ర్యాలీలో పాల్గొన్న పోలీసులు

మెగాలోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-కలకడ

జాతీయ మెగా లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. ఈనెల 13 నుంచి దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న లోక్ అదాలత్ కార్యక్రమంలో పలు రకాలైన పాత కేసులను పరిష్కరించు కొనేందుకు చక్కని అవకావమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు వివిధ రకాలైన ఘర్షణలతో కేసులు నమోదు చేసుకుని ఇంతవరకు పరిష్కారం కానీ కేసులను సైతం రాజీ చేసుకునేందుకు చక్కని అవకాశమని ఆయన ప్రజలకు సూచించారు. ప్రతి ఒక్కరూ ప్రతీకారాలకు చోటు ఇవ్వకుండా సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకొని స్నేహభావంతో మెలగాలని సూచించారు. అనంతరం గ్రామస్తులు, పోలీసు సిబ్బంది కలిసి ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్, పోలీసు సిబ్బంది, మండల గ్రామీణ ప్రాంత ప్రజలు, పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం : తల్లీ, బిడ్డ క్షేమం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ గర్భవతిని ప్రసవం కోసం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమద్యంలోనే పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. 108 సిబ్బంది ఇఎంటి దివ్యశ్రీ, పైలట్ రాజులు అందించిన సమాచారం మేరకు..మండలానికి చెందిన వెంకటేష్ భార్య నాగమణి (23)కి పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు తమకు సమాచారం అందించారన్నారు. నాగమణిని ప్రసవం కోసం జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా నీరుగట్టువారిపల్లికి చేరుకోగానే పురిటి నొప్పులు ఎక్కువై వాహనం లోనే పండంటి మగబిడ్డను ప్రసవించినట్లు తెలిపారు. నాగమణికి ఇది నాలుగో కాన్పు అని, తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారని అన్నారు. సుఖప్రసవానికి సహకరించిన 108 సిబ్బందికి నాగమణి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

16న చిన్నమండెం మండల సమావేశం

ప్రజాశక్తి-చిన్నమండెం

ఈనెల 16న ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మండలాధ్యక్షురాలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచులు హాజరు కావాలన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ హాజరై నీటి వనరులు, నాడు-నేడు పాఠశాలలు, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం, పరిశుభ్రత తదితర వాటిపై సమీక్షిస్తారని చెప్పారు. మండలంలోని ఆయా శాఖల అధికారులు తమ అభివృద్ధి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

ప్రతిభ చాటిన విద్యార్థుల కరస్పాండెంట్ టి.వెంకట చలమారెడ్డి

డిగ్రీ ఫలితాలలో సత్తాచాటిన శ్రీ షిర్డీసాయి విద్యార్థులు

ప్రజాశక్తి-రాయచోటి

యోగి వేమన యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ ఒకటి, 3వ సెమిస్టర్ ఫలిలాలలో శ్రీషిర్డీ సాయి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. కళాశాల కరస్పాండెంట్ టి.వెంకటచలమారెడ్డి తెలిపారు. శుక్రవారం షిరిడిసాయి డిగ్రీ కళాశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చలమారెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన ఎస్.రేమ 10, ఉజమ్‌తన్వేర్ 9.74, అఖిల 9.61, జయశ్రీ 9.60, ఆయేషా 9.48, ఇమాన్‌ఖాన్ 9.46, జైబా 9.44, కరీనా 9.36, సానియా 9.24, ముష్కాన్ 9.17, దీప 9.14, నందిని 9.10, రుహేనా 9.7, సుమీయ ఖానామ్ 9.4, పూజిత 9.2 శాతం మార్కులు సాధించారని తెలిపారు. వైవియూ ఫలితాలలో మొదటి స్థానం సాధించి రాయచోటి కీర్తిని జిల్లా స్థాయిలో నిలపడం సంతోషకరమన్నారు. సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్స్‌కు శిక్షణ అందిస్తు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న ఏకైక కళాశాల శ్రీ షిర్డిసాయి మహిళా కళాశాల అని అన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృంద, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తొమ్మిది గ్రామాల్లో భూసర్వే పూర్తి

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని 13 గ్రామపంచాయతీ పరిధిలోని 9 గ్రామాలలో భూ రీ సర్వే పూర్తయిందని తహశీల్దార్ అరవింద్‌కిషోర్ తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని గువ్వల చెరువు, నీలకంఠ్ర రావుపేట, సుద్దమల్ల, సరస్వతి పల్లి, హసనాపురం, చిట్లూరు, బండపల్లి, పొత్తుకూరుపల్లి, కొమ్మరపల్లి, గ్రామాలలో భూ రీసర్వే జరిగిందన్నారు. ఇంకా కసిరెడ్డి గారిపల్లి, నల్లగుట్టపల్లి. గోపగుడిపల్లి, రాచపల్లి గ్రామాలలో భూ రీసర్వే జరగాల్సి ఉందన్నారు. మిగిలిన గ్రామాల్లో కూడా భూ రీ సర్వే త్వరగా పూర్తి చేస్తామన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న తహశీల్దార్ ఉదయ్‌శంకర్ రాజు

తహశీల్దార్‌గా ఉదయ్‌శంకర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండల తహశీల్దార్‌గా ఉదయ్‌శంకర్‌రాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నందలూరు తహశీల్దార్ పనిచేస్తూ డిప్యూటేషన్ పై లక్కిరెడ్డిపల్లి మండల తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇక్కడ డిటిగా పని చేశానని, మండల సమస్యలపై అవగాహన ఉందన్నారు. అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. అనంతరం విఆర్ఒలు, మండల సర్వేయర్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి సకాలంలో వారి సమస్యలు తీర్చాలన్నారు. విధులు పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. రైతుల సమస్యలు పట్ల అంకిత భావంతో పని చేయాలని సూచించారు. సమావేశంలో డిటి నరసింహులు, మండల సర్వేయర్ కరీముల్లా, ఆర్ఐ సమ్మక్క, విఆర్ఒలు పాల్గొన్నారు.

మహారాజశ్రీ నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

E.O.P.No : 1/2021

కడవకూటి తిరుపతయ్య తండ్రి బలరామయ్య డోర్ నెం 1/18-A, లేబాక గ్రామం, నందలూరు మండలం, అన్నమయ్య జిల్లా.

...పిటిషనర్

వర్సెస్

అన్నం భరత్ రాయల్ తండ్రి అన్నం నాగేంద్రమూర్తి, లేబాక గ్రామం, నందలూరు మండలం, అన్నమయ్య జిల్లా.

...రెస్పాండెంట్

పై తెలిపిన పిటిషనర్, రెస్పాండెంట్ అయిన నీపై ఎలక్షన్ చెల్లదని నీ పై ఎలక్షన్ పిటీషన్ దాఖలు చేసియున్నాడు. నీకు ఎలాంటి ఆక్షేపణలు ఉన్న యెడల 19.05.2023 ఉదయం 10.30 గంటలకు పై కోర్టులో స్వయంగా గానీ వకీలు ద్వారా గానీ హాజరై మనవి చేసుకోవలెను. లేనంతట పరొక్షమున తీర్మానించబడును.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//

కె వెంకట సుబ్బయ్య
పిటీషన్ పరం అడ్వకేట్
కడప.
సెల్ 9704890225.

సంక్షేమ పాలన చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

వైసిపి ప్రభుత్వం అందించే సంక్షేమ, అభివృద్ధి పరిపాలనను చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక పోతున్నాయని ఎమ్మెల్యే నవాజ్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం నిమ్మనపల్లిలోని జడ్‌పి హైస్కూల్ (తెలుగు) మైదానంలో ఎంపిపి నరసింహులు అధ్యక్షతన వైఎస్ఆర్ ఆసరా మూడవ విడత నిధుల పంపిణీ బహిరంగసభను నిర్వహించారు. మండలంలోని డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నవాజ్‌బాషాకు మండలపరిషత్, వెలుగు సిబ్బంది తరపున ఎంపిడిఒ లీలామాధవి, ఎపిఎం రజనీకుమారి పుష్ప గుచ్చం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాలపై ధ్వజమెత్తారు. ప్రతిపక్ష పార్టీల మాటలను నమ్మొద్దని డ్వాక్రా మహిళలను కోరారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల కోసం ఒక ఆశయాన్ని నిర్దేశించుకుని సంక్షేమ పాలనను అందిస్తున్నారని అన్నారు. ప్రతిపక్ష నేతగా ప్రజాసంకల్పయాత్ర చేసి, ప్రజల కష్టాలు తెలుసుకుని రెండు పేజీల మేనిఫెస్టోతో అధికారంలోకి వచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 90శాతం నేరవేర్చాని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి పయనంలో ముందుకెళ్లాలన్నా మరోసారి జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. మండలంలో 591 డ్వాక్రా సంఘాలు ఉండగా 5112 మంది డ్వాక్రా సంఘ సభ్యులు రూ.5,12 కోట్ల నిధులు నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయడం జరిగిందన్నారు. మదనపల్లి నియోజకవర్గానికి వైద్య కళాశాలను మంజూరు చేశామని, మదనపల్లి-తిరుపతి మధ్య నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి, వెలుగు డిపిఎం లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు రెడ్డిశేఖర్‌రెడ్డి, ఆర్‌బికె చైర్మన్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, వైసిపి మండల ఇన్‌ఛార్జి ఆర్ఐ రమణారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, వైసిపి రాజంపేట పార్లమెంట్ ప్రధానకార్యదర్శి కొమ్మేపల్లి శ్రీనివాసులురెడ్డి, తహశీల్దార్ సి.ఆర్ మంజుల, వైస్ ఎంపిపిలు జయ ప్రకాశ్‌రెడ్డి, సుజాత, కో-ఆప్షన్ సభ్యులు మహమ్మద్‌రఫీ, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు మెగా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

రాయచోటి : సన్మానం పొందిన నర్సులతో రోటరీక్లబ్ సభ్యులు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజా బేగం ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెవివి అధ్యక్షులు ప్రభుచరణ్ మాట్లాడుతూ 1854లో క్రిమియా యుద్ధంలో టర్కీలో గాయపడిన సైనికులకు ఫ్లోరెన్స్ అందించిన సేవలను కొనియాడారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ గౌరవార్థం ఆమె పుట్టినరోజును అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. అనంతరం నర్సులకు స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు హర్షిత రెడ్డి, లేఖ్య, శ్రీలక్ష్మి, సోని, హెడ్‌నర్సు గోవిందమ్మ, నర్సులు సుజాత, లావణ్య, స్వప్నప్రియ, సునీత, సర్‌తాజ్, రాణెమ్మ, సిబ్బంది సుధాకర్, భాస్కర పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** మండల కేంద్రంలోని కమ్యూనిటీ ఆస్పత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ధరణి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సంరక్షణలో నర్సులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయక రోగులకు సేవలను అంది స్తారని అన్నారు. మనకు ఏ ఆరోగ్య సమస్య వచ్చినా ఆస్పత్రికి వెళ్ళినపుడు డాక్టర్ కన్నా ముందు వచ్చి మనకు సహాయం చేసేది నర్సులేనని తెలిపారు. కోవిడ్-19 మహమ్మారి సమయంలో నర్సులు పోషించిన పాత్ర, అందించిన సేవలు అమోఘమని కొనియాడారు. అనంతరం వైద్యాధికారి కీర్తిరెడ్డి మాట్లాడుతూ వైద్యరంగంలో కీలకమైన నర్సు వృత్తికి గౌరవాన్ని, హుందాతనాన్ని తీసుకొచ్చిన ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టినరోజు మే 12 సందర్భంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం 1965 నుంచి జరుపుతున్నాంని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జీవన్‌కుమార్, భరత్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, ఎఎన్ఎం నర్సులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు. **రాయచోటి :** ప్రపంచ నర్సులు దినోత్సవం సందర్భంగా రాయచోటి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో సేవలందిస్తున్న నర్సులను రోటరీ క్లబ్ తరఫున సన్మానం చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షులు అనసూయ దేవి మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవగా భావించి నర్సులు సేవలు అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ ప్రెసిడెంట్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ల బృందము, రోటరీ క్లబ్ అసిస్టెంట్‌గవర్నర్ డాక్టర్ రెడ్డన్న, సెక్రటరీ నరసింహారెడ్డి, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

క్రికెట్ కోచింగ్ క్యాంప్‌ను వినియోగించుకోండి

ప్రజాశక్తి-నందలూరు

సమ్మర్ స్పెషల్ క్రికెట్ కోచింగ్ క్యాంప్‌ను వినియోగించుకోవాలని జిల్లా క్రికెట్ ఆపరేటర్ ఖాజా మోహిద్దీన్, ఐపిఎల్ క్రికెటర్ పైడికాల్వ విజయ్‌కుమార్, కడప అపెక్స్ మెంబర్ దౌలా శిక్షణ క్రీడాకారులకు సూచించారు. మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ అరవపల్లె లోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరు గుతున్న సమ్మర్ కోచింగ్‌ను వారు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఖాజా మొహిద్దీన్ మాట్లాడుతూ కడప జిల్లాలో వున్న వాటిలో నందలూరు క్రికెట్ సబ్ సెంటర్‌లో అబ్బాయిలు, అమ్మాయిలు చాలా మంది రావటం హర్ష ణీయమని అన్నారు. శిక్షణకు కావల్సిన అన్ని సదుపాయాలు కల్పించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. పైడికాల్వ విజయ్‌కుమార్, దౌలా శిక్షణలో ఉన్నవారికి పలు సలహాలు సూచనలు అందించారు. అమ్మాయిలు బాగా తర్ఫీదు పొందితే కడప పట్టణం లోని సిఎవైడి స్టేడియం లోని క్యాంప్‌లో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తామని హామీనిచ్చారు. సమ్మర్ స్పెషల్ క్రికెట్ కోచింగ్ క్యాంప్ ద్వారా ఉత్తమ ప్రతిభ కనబరచి తల్లిదండ్రులకు, నందలూరు మండ లానికి, క్రికెట్ సబ్ సెంటర్‌కు మంచి పేరు తేవాలని చెప్పారు. అనంతరం క్రీడాకారులకు బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో మెళుకువలను తెలిపారు. ఇందులో స్థానిక హెడ్ కోచ్ సయ్యద్‌గయాజ్, అసిస్టెంట్ కోచ్ ఫిరోజ్‌ఖాన్ లోడి, ట్రైనర్ శివకోటి, క్యురేటర్ హరికృష్ణ పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరానికి విశేష స్పందన

కలికిరి: స్థానిక గ్రంధాలయం కలికిరిలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరానికి విశేష స్పందన వస్తుందని గ్రంధాలయ అధికారి విజయకుమార్ అన్నారు. విద్యార్థులు వేసవి సెలవులని చక్కగా సద్వినియోగం చేసుకుంటున్నారని, ఈ శిబిరాలకు విద్యార్థులు రావడం వలన మానసిక అభివృద్ధితో పాటు శారీరకాభివృద్ధి జరుగుతుందని అన్నారు. విద్యార్థులు యోగ, డాన్స్, స్పోకెన్ ఇంగ్లీష్, చిత్రలేఖనం, సంగీతం అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమానికి విద్యార్థులు తల్లిదండ్రులు, గ్రంధాలయం సిబ్బంది పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-గాలివీడు

ఇంటిపై పిడుగు పడడంతో కుటుంబ సభ్యులు ప్రమాదాన్ని తప్పించుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని గోపనపల్లి పంచాయతీ బండ కింద హరిజనవాడకు చెందిన సీతారామాంజులు తన భార్య పిల్లలతో కలిసి గురువారం రాత్రి నిద్రపోతుండగా గాలివాన భీభత్సం సృష్టించడంతో ఇంటిపై పిడుగు పడింది. ఈ ప్రమాదం నుంచి వారు ప్రాణాలతో భయపడ్డారు.

పంటల సాగుపై అవగాహన

ప్రజాశక్తి-సుండుపల్లి

మండంలోని ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి కె.ఉమామహేశ్వరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె పంటల సాగుపై రైతులకు సలహాలు, సూచనలు అందించారు. డ్రోన్ ఫైలెట్‌గా డిప్లమా పాలిటెక్నిక్, డిప్లమా ఇంజినీర్ అగ్రికల్చర్ డిప్లమా చదివి నిరుద్యోలుగా ఉన్న అభ్యర్థులు ఉపయోగించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో డిఆర్‌సిఎడిఎ శ్రీకాంత్, ఎంపిడిఒ, సలహా మండలి సభ్యులు, అన్ని గ్రామాల రైతు భరోసా సిబ్బంది, ఎపి సిఎం సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ఓబులవారిపల్లి: మండల పరిధిలోని ముక్కావారి పల్లి అరుంధతివాడలో ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.22 లక్షలతో మాతమ్మగుడికి ముక్కా రూపానంద రెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ముక్కవారిపల్లి సర్పంచ్ అరవ శ్రీధర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పుత్తావాండ్లపల్లిలో విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-వీరబల్లి

మండల పరిధిలోని సోమవరం పంచాయతీ పుత్తావాండ్లపల్లిలో వెంకటేశ్వర స్వామి ఆలయంలో విగ్రహాన్ని ప్రతిష్టాపన చేశారు. విఆర్ గ్రూప్ చైర్మన్ వి.ఆర్.రెడ్డి ఆధ్వర్యంలో వెంకటేశ్వరుని ఆలయం ఘనంగా నిర్మాణమైంది.శుక్రవారం వెంకటేశ్వర స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ట మూడు రోజులపాటు ప్రత్యేక పూజ కార్యక్రమం జరిగింది. వచ్చిన భక్తులకు అందరికీ మూడు రోజులపాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు మేడా మల్లికార్జు రెడ్డి, గడికోట శ్రీకాంత్ రెడ్డి, ఎ పిఇఆర్‌సి చైర్మన్ నాగార్జున రెడ్డి, పంచాయతీ సిఎండి పూజా కార్యక్రమానికి హాజరయ్యారు. అన్ని గ్రామాల నుంచి ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమంలోవీరబల్లి మండల వైసిపి నాయకులు గాలివీటి వీరనాగిరెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు కుళ్ళాయి రెడ్డి, రామస్వామిరెడ్డి, మంత్రి శివారెడ్డి సర్పంచులు నేతి ఆంజనేయులు, గోపీనాథ్‌రెడ్డి, నరసింహులు, సత్యనారాయణ రెడ్డి, విజయ సారథిరాజు, మణిరాజు, విశ్వనాథరెడ్డి, బసిరెడ్డి , జెసిఎస్ మండల కన్వీనర్ నరేష్ స్వామి, బాడేపల్లి రవి, శివారెడ్డి, మహేష్‌రాజు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన దళిత కుటుంబాలు

ప్రజాశక్తి-చిట్వేలు

మండల పరిధిలోని తిమ్మయ్య గారి పల్లె పంచాయతీలో శుక్రవారం చేపట్టిన ఇదేమి కర్మ రాష్ట్రానికి కార్యక్రమానికి రైల్వే కోడూరు టిడిపి ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాథ నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం పరిపాలన చేస్తున్న రాక్షస పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని అన్నారు. రాష్ట్రంలో నిత్యవసర ధరల దగ్గర నుంచి ప్రయాణించే బస్సు చార్జీల వరకు మధ్యతరగతి కుటుంబానికి ఉపయోగపడే ప్రతి వస్తువులు అధిక భారాన్ని మోపారని అన్నారు. ముఖ్యమంత్రి సైకో గా వ్యవహరిస్తూ ప్రజలను అనేక ఇబ్బందులు గురిచేస్తున్నారని వారన్నారు. ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో రాబోయే ఎన్నికల్లో టిడిపిని ఆదరించి చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిని చేయాలని అన్నారు.రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. అనంతరం తిమ్మాయగారిపల్లె దళితవాడ నుంచి సుమారు వందమంది టిడిపిలో చేరారు. కార్యక్రమంలో రాజశేఖర్ ,పెద్దూర్ రాజా, బాలకృష్ణ యాదవ్, ఎస్‌సి సెల్ మండల అధ్యక్షుడు పెంచలయ్య, అనిత దీప్తి, అనంత యాదవ్, శీను, పెరుగు కిష్టయ్య, గుండాల యాదవ్, వెంకటేష్ రాజు, షబ్బీర్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మసీదుల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

- జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్.ఎ.కరీముల్లా

మదనపల్లె అర్బన్ : మసీదుల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు అన్నమయ్య జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఎస్.ఎ.కరీముల్లా పేర్కొన్నారు. శుక్రవారం మదనపల్లె రూరల్ మండలం బండకిందపల్లెలో మసీదును ఆయన సందర్శించారు. స్థానికంగా నెలకొన్న పరిస్తితులను ఆరాతీస్తు, క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులు, సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. మసీదులో ఇమామ్, మౌజంలకు జీతాలు రాలేదని వారు చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరారు. వీటిపై కరీముల్లా స్పందిస్తూ మసీదు కమిటీని రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. తద్వారా భవిష్యత్తులో సమస్యలు ఉండవని తెలిపారు. ఇమామ్, మౌజంలకు జీతాల సమస్యను పరిష్కరిస్తూ సంక్రమంగా అందేలా చూస్తా మన్నారు. అనంతరం ఎస్.ఎ.కరీముల్లాను శాలువ, పూలమాలతో సన్మానిం చారు. కార్యక్రమంలో ఖాదర్ బాషా, బాబా ఫకృద్దీన్, మస్తాన్ వల్లి, పయాజ్, సాదిక్, వసిమ్ పాల్గొన్నారు.

యారో గేమింగ్ జోన్ ప్రారంభం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సరికొత్త ఆటల ప్రపంచమైన యారో గేమింగ్ జోన్‌ని మదనపల్లి వాసులకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు నిర్వాహకులు కె.వెంకట శివారెడ్డి, డి.భార్గవ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం యారో గేమింగ్ జోన్ ప్రారంభోత్సవ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి నగరాల్లో ఇటువంటి గేమింగ్ జోన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మదనపల్లి పట్టణంలో యారో గేమింగ్ జోన్ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. చిన్నారులు, పెద్దల కాలక్షేపం, ఆటలపై ఆసక్తి పెంచడం కోసం వారి తల్లిదండ్రులు ఈ గేమింగ్ జోన్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇక్కడి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా గేమ్స్ ధరలను నిర్ణయించడం జరిగిందన్నారు. పిల్లలు గేమ్స్ ఆడే సమయంలో వారి బాగోగులను చూసుకునేందుకు కేర్ టేకర్లను నియమించడం జరిగిందన్నారు. ముఖ్యంగా సాఫ్ట్ ప్లే జోన్, బైక్ రేస్, టాయ్ క్యాచ్, టేబుల్ ఫుట్ బాల్, విఆర్ గేమ్, వాటర్ గేమ్స్, ప్లే స్టేషన్, పిఎస్ ఫైల్, కార్ రేస్, ఎయిర్ హాకీ, గన్ షూటింగ్ వంటి ఆసక్తికరమైన గేమ్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. యారో గేమింగ్ జోన్‌కు పట్టణం, నియోజకవర్గ ప్రజలు విచ్చేసి ఆనందంగా గడపాలన్నారు. కార్య క్రమంలో సిబ్బంది కె.మోహన్, సాయిగురుచరణ్, అసిఫ్, అమృత, లావణ్య, లక్ష్మి పాల్గొన్నారు.

యారో గేమింగ్ జోన్ ప్రారంభిస్తున్న నిర్వాహకులు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి మేడా విజయభాస్కర్ రెడ్డి

గర్భిణుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి-నందలూరు

గర్భిణులకు ఆరోగ్య విషయంలో అవగాహన కల్పించడంలో నిర్లక్ష్యం తగదని ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంపిడిఒ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం ఎంపిడిఒ సౌభాగ్యమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గర్భిణులకు అవగాహన కల్పించడంలో అంగన్వాడీ వర్కర్లు, సూపర్వైజర్ విశాలాక్షి విఫలం చెందారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలలో పదవ తరగతి ఫలితాలలో నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెనకబడిందని, వచ్చే ఏడాది మంచి మార్కులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎంఇఒ గంగిరెడ్డికి సూచించారు. మండలంలో అంగన్వాడీ సెంటర్లకు వచ్చే గర్భిణులు 259 మంది ఉన్నారని, వారికి అవగాహన కల్పించి మండల పిహెచ్‌సికి రెఫర్ చేయాల్సిన బాధ్యత అంగన్వాడీ టీచర్లపై ఉందన్నారు. వైఎస్ఆర్ దుల్హన్ పథకం, వైఎస్ఆర్ కళ్యాణమస్తు పథకం మండలంలోని 84 మందికి గాను 12 మందికి మంజూరు కావడంతో మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి గడికోట ఉషారాణి, వక్ఫ్‌బోర్డు జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, మండల కో-ఆప్షన్ సభ్యుడు కరీముల్లా ఖాన్, డిటి మోహన్, ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

అనధికార విద్యుత్ కోతలు

ప్రజాశక్తి-గాలివీడు

వర్షం వచ్చిందంటే గాలివీడులో విద్యుత్ కోతలు అధికమవుతున్నాయి. గురువారం రాత్రంతా కరెంటు లేకపోవడంతో ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. శుక్రవారం ఉదయం ఆరు గంటలకు తిరిగి విద్యుత్‌ను పునరుద్ధరించారు. పట్టణంలో రాత్రిళ్ళు కురుస్తున్న గాలి, వర్షానికి చెట్లు నెలరాలిపోవడం విద్యుత్ స్తంభాలు కిందపడడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఎఇ నరేంద్రరెడ్డి పేర్కొన్నారు. వర్షం రాకుండా ఉంటే విద్యుత్‌కు అంతరాయం ఏర్పడదని అన్నారు. గాలి వాన రావడంతో విద్యుత్తు లైన్లు తెగిపోవడం విద్యుత్ స్తంభాల నేలకొరగడంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందన్నారు. త్వరలో సర్దుబాటు చేసి సమస్యలను లేకుండా చూస్తామని, ప్రజలు సహకరించాలని కోరారు.

సిబిఎస్‌సిలో వంద శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి-కురబలకోట

అంగల్లు సమీపంలోని విశ్వం పాఠశాలలో సిబిఎస్‌సి సిలబస్ చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం వెలువడిన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ రాక్లన్ ప్రియ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశ్వం పాఠశాలలో ఉన్నతమైన విద్యాబోధన చేయడం వల్ల వందశాతం ఉత్తీర్ణత సాదించమన్నారు. సిబిఎస్‌సి ఫలితాల్లో కె.లాల్ సింగ్, యం.యస్వని విద్యార్థులు ఎగ్రేడులో ఉత్తీర్ణత సాధించారని అన్నారు. వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేసిననటువంటి పాఠశాల ప్రిన్సిపల్ రాక్లన్ ప్రియ ఉపాధ్యాయ బృందానికి చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు. సహకరించిన తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సంవత్సరం నుండి 110, 12వ తరగతులు కూడ 6856 సిలబస్ బోధన చేయడం జరుగుతుందని అన్నారు. పాఠశాలలో అడ్మిషన్లు జరుగుతున్నాయని ఆసక్తి గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ప్రజాశక్తి-ములకలచెరువు

ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొనడంతో యువకుడు మృతి చెందిన సంఘటన ములకలచెరువు మండలంలో చోటు చేసుకుంది. 108 సిబ్బంది, పోలీసుల కథనం మేరకు పెద్దతిప్పసముద్రం మండలం, రంగసముద్రం పంచాయతీ, విసనకర్రవాండ్లపల్లెకు చెందిన ఖాసింవలి(32) కుటుంబ సభ్యులతో కలిసి ములకలచెరువులోని బంధువుల ఇంటికి వచ్చాడు. పగలంతా బంధువులతో సంతోషంతో గడిపాడు. భార్య, పిల్లలను బంధువుల ఇంటిలో వదిలేసి రాత్రి 9గంటల సమయంలో స్వగ్రామానికి వెళ్తుండగా కెజిఎన్ కళ్యాణ మండపం సమీపంలో వేగంగా వస్తున్న లారీ ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనానికి సమాచారం అందడంతో ములకలచెరువు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందించే లోపే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య షబీనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలిచారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండలంలో శుక్రవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన సంఘటన జరిగింది. పోలీసులు కథనమేరకు వివరాలు.. మండలం కోటకొండ పంచాయతీ మద్యంవారిపల్లికి చెందిన బొజ్జన్న ద్విచక్ర వాహనంపై పెద్దమండ్యం నుంచి తమ గ్రామానికి వెల్లుతుండగా మదనపల్లి నుంచి కారు సిద్ధవరం పంచాయతీ కోటగుట్టపల్లి వెళ్లే క్రాస్ వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ద్విచక్ర వాహనంలో వస్తున్న బొజ్జన్న అక్కడక్కడ మృతి చెందాడు. మండలంలోని సి.గొల్లపల్లి పంచాయతీ రెక్కలకొండపల్లి చెందిన వెంకటరమణ పరిస్థితి విషమంగా ఉందన్నారు. చేరువుకిందపల్లి నల్లగుట్ట క్రాస్ వద్ద ఉప్పరపల్లి నుంచి మూడు చక్రాల ఆటో పెద్దమండ్యం వైపు వస్తుండగా పెద్దమండ్యం నుంచి తంబళ్లపల్లి వైపు వెళుతున్న బులెరో వాహనం ఆటోను ఢీ కొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న కృష్ణమ్మ అక్కడకడే మృతిచెందింది. గాయపడిన వెంకటరమణను చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతి చెందిన బొజ్జన్న, కృష్ణమ్మ మృతదేహాలను శవ పంచనామా నిమిత్తం మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈఘటనలపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్


మాట్లాడుతున్న డిఎస్‌పి కేశప్ప

హత్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు డిఎస్‌పి కె.కేశప్ప తెలిపారు. స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి మాట్లాడుతూ మదనపల్లె పట్టణం నక్కలదిన్నె వద్ద వెల్డింగ్ షాపులో వర్కర్‌గా పనిచేస్తున్న సత్య సాయి జిల్లా వాసి పఠాన్ అక్రమ్ (24), మరి కొందరు కలసి ఈ నెల7వ తేదీన సాయంత్రం ఆటోలో కర్ణాటక రాష్ట్రం రాయల్పాడు స్వంత పనులపై వెళ్ళి తిరిగి వస్తుండగా కర్నాటక-ఆంధ్ర సరిహద్దులోని పెట్రోల్ బంకువద్ద ముందుగా వచ్చిన ఆటో డీజిల్ పట్టుకుని అందుకు సంబంధించిన బిల్లు అడిగారు. పెట్రోల్ బంకు వర్కర్ ఇవ్వకపోవడంతో వెనుక నుంచి వచ్చిన కడప జిల్లాకు చెందిన కారులో ముగ్గురు వ్యక్తులు ఆటో డ్రైవరుపై దురుసుగా ప్రవర్తించారు. ముందుగా వచ్చిన కారు చీకలబైలు ప్రాంతంలో వెనుక నుంచి వచ్చిన ఆటోను అడ్డుకున్న కారులో ముగ్గురు యువకులు దాడి చేయడంతో ఆటోలో ఉన్న అక్రమ్ అక్కడి నుంచీ పరారైయ్యాడు. నడుచుకుంటూ మదనపల్లె వైపు వస్తున్న అక్రమ్‌ను బార్లపల్లి సమీపంలోని మర్రిమాను వద్ద కారులోని ముగ్గురు అడ్డుకుని దాడిచేసి హత్యచేసి రోడ్డు ప్రక్కన పడేసి వెళ్ళిపోయారని తెలిపారు. అక్రమ్ హత్య కేసులో నిందితులైన కడప జిల్లా సింహాద్రిపురానికి చెందిన మహమ్మద్ రఫీ, అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో రూరల్ సిఐ సత్యనారాయణ పాల్గొన్నారు.